ప్రజల నుంచి అడుగడుగునా నీరాజనాలు

- పరిపాలన క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి చరిత్ర సృష్టించాం
- అర్హత ఉంటే చాలు అందరికీ సంక్షేమ పథకాలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి విడదల రజిని



ప్రీ ప్రైమరీ స్కూల్ ప్రారంభిస్తున్న మంత్రి రజిని

చిలకలూరిపేట టౌన్: జగనన్న పాలనలో ప్రజలకు చేసిన మేలు చెప్పేందుకు సగర్వంగా ప్రజల్లోకి వెళుతున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. చిలకలూరిపేట మండలం గోపాలంవారిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలు గురించి వివరించారు. పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చిన హామీల్ని సమర్థంగా అమలు చేసి ధైర్యంగా ప్రజల్లోకి వెళుతున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి స్థానంలో వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనే మహోన్నత వ్యక్తి ఉండబట్టే ఇది సాధ్యమైందని వివరించారు. ఇచ్చిన మాట పొల్లు పోకుండా ఒక్కో హామీని నెరవేర్చుకుంటూ తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఇప్పటికే 98శాతానికి పైగా హామీల్ని నెరవేర్చగలిగామని చెప్పారు. విశ్వసనీయత అంటే ఇదేనని, రాష్ట్రంలో జగనన్నకు మించిన విశ్వసనీయత మరే నాయకుడికి లేదని తెలిపారు. పరిపాలన క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి చరిత్ర సృష్టించారని చెప్పారు. అర్హత ఉంటే చాలు ఎలాంటి సంక్షేమ పథకమైనా అందరికీ అందాల్సిందే అనే నినాదంతో తమ ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఇప్పుడు ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలు గతంలో ఎప్పుడూ అమలు కాలేదని చెప్పారు. వార్డులకు, గ్రామ గ్రామానికి సచివాలయాల్ని తీసుకొచ్చి ప్రజలకు ప్రభుత్వ సేవల్ని అత్యంత సులభతరం చేశారని వివరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలుకుతున్నారని, వారి నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోందని చెప్పారు. ఇదంతా ఈ మూడున్నరేళ్ల చారిత్రక పాలన వల్లనే సాధ్యమైందని తెలిపారు. ఇలాంటి ప్రభుత్వం పది కాలాల పాటు మనుగడ సాగించాలని ప్రజలు మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారని, దీనికి ఉదాహరణ వారి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి లభిస్తున్న ఆదరణే నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.

ప్రీ ప్రైమరీ స్కూలు ప్రారంభం

గ్రామ పరిధిలో రూ. 13లక్షలతో నిర్మించిన వైఎస్సార్ ప్రీ ప్రైమరీ స్కూలును మంత్రి విడదల రజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె స్వయంగా పాలు పొంగించారు. శిలా ఫలకాన్ని గ్రామ నాయకులతో కలసి ఆవిష్కరించారు. పాఠశాలలో చిన్నారుల కోసం వేసిన చిత్రాల్ని ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, ఎంపీపీ దేవినేని శంకరరావు, సర్పంచ్ డాక్టర్ జడా జతిన్ దేవ్, ఎంపీటీసీ సభ్యురాలు తొట్టెంపూడి నాగవర్ధని, నాయకులు తొట్టెంపూడి శ్రీనివాసరావు, కంభంపాటి కోటయ్య, మహేష్, యములయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కుంకుమ బండి పూజలు



నాదెండ్ల: గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై సాతులూరు వద్ద రెడ్డి పేరంటాలమ్మ ఆలయంలో ఆదివారం కుంకుమ బండి పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన కమ్మ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు రూ.1లక్షతో అమ్మవారికి కుంకుమ బండి కట్టి తమ ఇంటి నుంచి గ్రామంలో సంప్రదాయబద్ధంగా మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేర్చి పూజలు, అభిషేకాలు జరిపారు. మొక్కుబడులు తీర్చారు. ప్రతి ఆదివారం ఆలయం వద్ద కుంకుమ బండి పూజలు నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారిని కోరుకున్న మొక్కులు తీరితే భక్తులు కుంకుమ బండి కడుతుంటారు.

పేద బ్రాహ్మణులకు బియ్యం పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వినుకొండలోని జీవీ మాధవరావు కార్యాలయంలో ఆదివారం నిరుపేద బ్రాహ్మణులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎక్కువసార్లు పేదల్ని ఆదుకున్న దాత చింతలపూడి రాజగోపాలరావును దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కళాతపస్వి కె.విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రఘు, మంత్రిరాజు సత్యనారాయణ, ఎస్. రామ్మోహనచార్యులు, అప్పరాజు నాగేశ్వరరావు, మురళీకృష్ణ, పుట్టంరాజు నారాయణరావు, భువనగిరి సుబ్రహ్మణ్యం, ఎం.వి.శర్మ, ఎస్.ఎస్. మల్లికార్జునశాస్త్రి, భాగవతుల రవికుమార్, చింతలపూడి భద్రయ్య, మతుకుమల్లి మురళి, అన్నాప్రగడ వెంకటేశ్వరరావు, ధూళిపాళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

15న సంత్ సేవాలాల్ జయంతి



యడ్లపాడు: మండలంలోని బోయపాలెంలో ఈ నెల 15న సుగాలీల మూల పురుషుడు సంత్‌సేవాలాల్ జయంతి వేడుకల్ని నిర్వహించనున్నట్లు ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి. శ్రీనునాయక్ తెలిపారు. వేడుకల గోడపత్రికలను స్థానిక సుగాలీ కాలనీలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ వేడుకల్ని విజయవంతం చేయాలని సుగాలీలను కోరారు. కార్యక్రమంలో బి. చిన్నానాయక్, వి. సూర్యానాయక్, ఎస్. పాములనాయక్, వి. లక్ష్మణ్‌నాయక్, వెంకటకృష్ణానాయక్, ఎం. గోపి, భూక్యా శృతిబాబు, ఆర్. శిరీషాబాయి పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డులోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం 42వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న వేడుకల్లో భాగంగా ఉదయం సాయినాథుడికి కాకడా హారతి, పంచామృతాభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. భోజనశాల నిర్మాణ దాత యు.సుబ్బారావు, సౌజన్య దంపతులు తొలిరోజు కార్యక్రమంలో భాగంగా సాయి నామ ఏకాహంను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సోమవారం నిర్వహించనున్న సాయినాథుని ప్రథమ పూజలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని పూజాదికాలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ ప్రతినిధి దుర్గాబాబు తెలిపారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాల లబ్ధి

ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరి శంకరావు

రొంపిచర్ల: రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించటమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లక్ష్యమని నరసరావుపేట శాసనసభ్యుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలో మాచవరంలో ఆదివారం ఆయన పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరి శంకరరావుతో కలసి పర్యటించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వారికి స్వాగతం పలికారు. మాచవరంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.20 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ నేత బొబ్బిలి కోటిరెడ్డి కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరుల్ని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 130 రోజులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. మాచవరంలో ఇప్పటి వరకు రూ.14 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ గ్రామంలో వైఎస్సార్ సీపీకి 800 ఓట్ల మెజార్టీ వచ్చిందని, రాబోయే ఎన్నికల్లో అంతకంటే ఎక్కువ మెజారిటీ వస్తుందని ఎమ్మెల్యే గోపిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రతి గ్రామంలో విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజల సమస్యల్ని తెలుసుకొని పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అందిస్తూ విజయవంతంగా పాలన చేస్తున్నారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తిరిగి పట్టం కట్టాలని ఆయన కోరారు. పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరి శంకరరావు మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఈ ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి తేడా ప్రజలు గమనించాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ గ్రామంలో వైఎస్సార్ సీపీకి 800 ఓట్ల మెజారిటీ రావడం అభినందనీయమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, గ్రామ సర్పంచ్ కరుణమ్మ, కునుగుంట శ్రీనివాసరెడ్డి, పడాల శివారెడ్డి, పల్లకి అంజనారెడ్డి, చపారపు సంజీవరెడ్డి, ఏరువ శ్రీనివాసరెడ్డి, రఘుపతి, బత్తుల రామకృష్ణ, పానుగోటి వెంకట్రావు, గుండాల వెంకటేష్, వాసుదేవరెడ్డి, గాదె రామిరెడ్డి, బచ్చు వెంకట్రావు, కళిరెడ్డి వెంకట కోటిరెడ్డి పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏసీఎల్ శ్రీనివాసకుమార్

యడ్లపాడు: వృద్ధులకు సేవ చేయడం భగవంతుడికి సేవ చేయడంతో సమానమని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (ఏసీఎల్) శ్రీనివాసకుమార్ చెప్పారు. బోయపాలెంలోని శ్రీ అనంతలక్ష్మి నూలు మిల్లు ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ మిల్లు ఎండీ సామినేని కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయన తండ్రి స్వర్గీయ సామినేని పానయ్య చారిటబుల్ ట్రస్టును స్థాపించి దశాబ్దంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అని కొనియాడారు. భవిష్యత్తులో వారి సేవలు మరింత విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. అనంతరం శిబిరంలో పెదకాకాని శంకర్ నేత్రాలయం వైద్య బృందం పాల్గొంది. యడ్లపాడు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, నాదెండ్ల మండలాలకు చెందిన 800 మంది పేదలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 250 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. శిబిరం ముగిసిన వెంటనే తొలి విడతగా 50 మందిని ప్రత్యేక వాహనంలో శస్త్ర చికిత్సకు తీసుకు వెళ్లారు. కార్యక్రమంలో రిటైర్డ్ కమిషనర్ ఆఫ్ లేబర్ యు. మల్లేశ్వరకుమార్, మిల్లు ఎండీ సామినేని కోటేశ్వరరావు, ఈడీ సామినేని ఫణికుమార్, జీఎం లింగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వకర్మల ఆర్థిక పురోగతికి పథకం దోహదం



కార్యక్రమంలో విశ్వకర్మలతో రామకృష్ణ

నరసరావుపేట: కేంద్ర బడ్జెట్‌లో విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టడం ద్వారా విశ్వకర్మల ఆర్థిక, సామాజిక పురోగతికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తోడ్పడ్డారని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి రంగిశెట్టి రామకృష్ణ పేర్కొన్నారు. పార్టీ ఆర్టిజెన్ సెల్ జిల్లా కన్వీనర్, విశ్వబ్రాహ్మణ సంఘ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సిద్ధు అనంత నాగబ్రహ్మాచారి ఆధ్వర్యంలో ఆదివారం నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ 16వ వార్డు శ్రీరాంపురంలోని శ్రీ మద్విరాట పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో విశ్వకర్మ సంఘీయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 140 పేర్లతో పిలవబడుతున్న విశ్వకర్మ సంఘీయులకు ఈ పథకం వల్ల ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ అధ్యక్షుడు చంద్రపాటి చెంచు సత్యనారాయణ, విశ్వ బ్రాహ్మణ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుట్ల శివాచారి, ప్రధాన కార్యదర్శి బొప్పూడి సాయి, యలవర్తి నాగాచారి, బొమ్మిడాకుల సైదాచారి పాల్గొన్నారు.

సొలసలో నూరుల్ హుదా మసీదు ప్రారంభం



హుదా సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన మసీదు

యడ్లపాడు: మండలంలోని సొలసలో నూతనంగా నిర్మించిన నూరుల్ హుదా మసీదు ఆదివారం రాత్రి ప్రారంభించారు. చిలకలూరిపేటకు చెందిన హుదా ధార్మిక సొసైటీ ఆధ్వర్యంలో నాలుగు సెంట్ల విస్తీర్ణంలో రూ.15 లక్షలతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ మసీదు ప్రారంభోత్సవానికి చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు షేక్ తలహాఖాన్, హుదా సొసైటీ వ్యవస్థాపకుడు పఠాన్ అబ్బాస్‌ఖాన్‌నద్వి, గుంటూరు, విజయవాడకు చెందిన మత, గ్రామపెద్దలు హాజరయ్యారు. దువా చేసి మసీదును ప్రారంభించారు. అనంతరం మసీదు ప్రాంగణంలో ఖురాన్ వాక్యాలను, అనంత కరుణామయుడు అల్లాహ్ ఆదేశాలను మతపెద్దలు వివరించారు. హుదా చైర్మన్ అబ్బాస్‌ఖాన్‌నద్వి మాట్లాడుతూ యడ్లపాడు మండలంలో హుదా సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన ఆరో మసీదు సొలస గ్రామంలోనిదని తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మసీదులు నిర్మించడంతో పాటు పేదలకు విద్యా, వైద్యం ఇతర సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న వారికి భారీ అన్నదానం నిర్వహించారు.

గుంటూరుకు తరలివెళ్లిన బీసీ నాయకులు



బోయపాలెంలో వాహనాలతో బయల్దేరుతున్న బీసీ నాయకులు

యడ్లపాడు: బీసీ రిజర్వేషన్ పితామహుడు బిందేశ్వర ప్రసాద్ మండల్ కాంస్య విగ్రహ ఆవిష్కరణకు యడ్లపాడు మండలం నుంచి బీసీ సంఘాల నాయకులు భారీగా తరలివెళ్లారు. గుంటూరులో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ప్రత్యేక వాహనాలకు బీసీ సంఘాల పతాకం ఏర్పాటు చేసుకుని నినాదాలు చేసుకుంటూ అక్కడకు వెళ్లారు. కార్యక్రమంలో బీసీ నాయకులు రాచమంటి చింతారావు, వడ్డేపల్లి నరసింహారాజు, వంకధారి శ్రీనుబాబు, గౌరు రాజేష్, కారుచోల వీరాంజనేయులు, బి. శివకోటేశ్వరరావు, కటారి రమేష్, ఆలా గోపి, గోగుల శివప్రసాద్, ఉప్పాల భాస్కరరావు పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: స్థానిక శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1986–89లో బీఏ చదివిన విద్యార్థులు దాదాపు 33 సంవత్సరాల తరువాత ఒకచోట చేరి తమ అనుభవాల్ని పంచుకున్నారు. తమ అభ్యున్నతికి కృషి చేసిన అప్పటి అధ్యాపకుల్ని ఘనంగా సత్కరించి గురుభక్తి చాటుకున్నారు. కార్యక్రమంలో అప్పటి కళాశాల అధ్యాపకులు ఎం.ఆర్.కె.మూర్తి, కె.రాజశంకరరావు, బి.శివధర్మశాస్త్రి, ఏ.హరిహరనాథశాస్త్రి, ఈ.ఎం.స్వామి, గ్రంథాలయాధికారి కె.వి.కె.రామారావు, ప్రస్తుత పాలకవర్గ అధ్యక్షుడు కె.వి జయకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమాల్ని పూర్వ విద్యార్థులైన ఎన్‌సీసీ మేజర్ బి.ఎస్.ఆర్.కె. రాజు, బి.వి.ఎస్.కామేశ్వరశాస్త్రి, బి.వి.కామేశ్వరశాస్త్రి, షేక్ కరీముల్లా, ఎ. శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

విపత్తుల సమయంలో వలంటీర్లు కీలకపాత్ర



మాట్లాడుతున్న దిశ సీఐ సుభాషిణి

నరసరావుపేట రూరల్: విపత్తుల సమయంలో వలంటీర్ల పాత్ర కీలకమని దిశ పోలీస్ స్టేషన్ సీఐ సుభాషిణి తెలిపారు. కోటప్పకొండ ఎస్ఆర్‌టీపీ శిక్షణ కేంద్రంలో ఆపదమిత్ర కార్యక్రమంపై నిర్వహిస్తున్న తరగతుల్లో ఆదివారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు చేరువలో ఉన్న వలంటీర్లు, ఆశ వర్కర్ల వ్యవస్థలను అనుసంధానం చేసి పనిచేయడం ద్వారా విపత్తుల్ని సమర్థంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. విపత్తుల సమయంలో మొదటి ప్రాధాన్యతగా వైద్యం, ఆహారం అందించాలని సూచించారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ మేనేజర్ కె.నాగేశ్వరరావు, డీఆర్పీ డి.నాగేశ్వరరావు, జిల్లాలోని ఆశవర్కర్లు, వలంటీర్లు, దిశ మహిళా పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు తరలివెళ్లిన బీసీ సంఘ నాయకులు

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని బీసీ సంఘ నాయకులు గుంటూరులో ఏర్పాటు చేసిన బీపీ మండల్ కాంస్య విగ్రహ ఆవిష్కరణకు ఆదివారం తరలి వెళ్లారు. సత్తెనపల్లి పట్టణంతో పాటు నాలుగు మండలాల నుంచి 30 వాహనాల్లో గుంటూరు చేరుకొని బీపీ మండల్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు తోక మదన్‌మోహన్, తుళ్లూరు శివరామకృష్ణ, నంబుల వెంకటేష్, రామస్వామి, మోహన్, గుంటూరు గోవిందు, నడియా దనపాల్, కందుల అంబేడ్కర్, షేక్ చిన్న షరీఫ్, జిల్లెల పాలరాజ్, పల్లపు ధర్మారావు, గుంజి విజయ్, కంటూ చిన్న బ్రహ్మం, కుమ్మరి దస్తగిరి, సిద్దెల వేణు, గొట్టం వెంకటేష్, టీ స్టాల్ శ్రీను తదితరులు ఉన్నారు.

రాహు కేతువులకు విశేష పూజలు

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో రాహుకేతువుల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం రాహుకేతువులను పూజిస్తే శుభ ప్రదమని భావించి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు దంపతులు పూజల్లో పాల్గొని, మొక్కులు చెల్లించారు.

అమరేశ్వరాలయ అర్చకునికి డాక్టరేట్



అమరావతి: అమరేశ్వరాలయం అర్చకుడు ముక్కామల కృష్ణనాగరాజ్ మల్లిక్‌కు కెనడాకు చెందిన బ్రాప్టన్ విశ్వవిద్యాలయం జ్యోతిష్య శాస్త్రంలో 'వక్ర గ్రహాలు–వాటి ఫలితాలు' అనే అంశంపై పరిశోధనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆదివారం ఆయనకు ఆలయ సిబ్బంది, తోటి అర్చకులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. శనివారం కర్ణాటకలోని హోసూరు బ్రాప్టన్ విశ్వ విద్యాలయ భారతదేశ శాఖ స్నాతకోత్సవంలో డైరెక్టర్ యేలూరి శ్రీనివాస్ నుంచి డాక్టరేట్ అందుకున్నట్లు మల్లిక్ తెలిపారు.

వైభవంగా కలశ ప్రతిష్ఠ

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు రుక్మిణీ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ శిఖర కలశ ప్రతిష్ఠను ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. వేద పండితుడు చేజర్ల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మంత్రోచ్చారణతో సంప్రదాయబద్ధంగా జరిపారు. భక్తులు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. గతంలో పంచలోశిఖర కలశం చోరీకి గురికావడంతో దాని స్థానంలో నూతనంగా ఏర్పాటు చేసినట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారి బి.శ్రీనివాసులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సత్యసాయి సేవకుల రక్తదానం



నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డు రంగావారి వీధిలోని శ్రీసత్యసాయి మందిరంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పల్నాడు జిల్లా శ్రీసత్యసాయి సేవాసంస్థలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో శ్రీసత్యసాయి యువజన విభాగం ప్రతినిధులు 30మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర యూత్ కో–ఆర్డినేటర్ కె.సాయిప్రదీప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు సీహెచ్.ఉమాధవ్, కన్వీనర్ ఏ.వి.హరినాథబాబు, రామకృష్ణసాయి పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ దయానిధి సిబ్బందితో వైద్యసేవలు అందించారు.

ముగిసిన దక్షిణ భారత హిందీ ప్రచార పరీక్షలు

చిలకలూరిపేట టౌన్: దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షలు ఆదివారం ముగిశాయి. పట్టణంలోని సాదినేని చౌదరయ్య పాఠశాలలో పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర, ప్రవేశిక పరీక్షలు నిర్వహించారు. మొత్తం 154 మంది విద్యార్థులకు గానూ 129 మంది హాజరయ్యారు. పరీక్షలను స్కూలు డైరెక్టర్ సి. ప్రభాకరరెడ్డి, ప్రిన్సిపాల్ బాష పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ల ఎంపిక

చిలకలూరిపేట (యడ్లపాడు): చిలకలూరిపేట పట్టణం, నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట మండలాల పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్లు నలుగురు, ఒక్కొక్క మండలంలో మరో నలుగురు కో–కన్వీనర్లను పార్టీ నియమించింది. చిలకలూరిపేట పట్టణ కన్వీనర్‌గా పి. సాగర్‌బాబు(గణపవరం), కో–కన్వీనర్లుగా చేబ్రోలు వెంకటేష్(చిలకలూరిపేట), సయ్యద్ ఇక్బాల్(పురుషోత్తమపట్నం), కె.రామునాయుడు(గణపవరం), జి. గోపి(చిలకలూరిపేట) నియమితులయ్యారు. చిలకలూరిపేట మండల కన్వీనర్‌గా షేక్ షబ్బు(పసుమర్రు), కో–కన్వీనర్లుగా బొంతాగని(వేలూరు), పి. శ్రీనివాసరావు(మురికిపూడి), షేక్ జాని (పసుమర్రు), షేక్ ఇర్ఫాన్(పసుమర్రు) నియమితులయ్యారు. నాదెండ్ల మండలం కన్వీనర్‌గా సీహెచ్. సునీల్‌రెడ్డి(గొరిజవోలు), కో–కన్వీనర్‌గా కుడారి విజయ్(నాదెండ్ల), షేక్ ఫరీద్(నాదెండ్ల), జె. ప్రసన్ననాయుడు(గణపవరం), ఎం.వి. సుభాని(సాతులూరు) నియమితులయ్యారు. యడ్లపాడు మండలం కన్వీనర్‌గా ఎస్. కృష్ణగౌడ్(యడ్లపాడు), కో–కన్వీనర్‌గా బిరుదు అనంత్‌బాబు(తిమ్మాపురం), కుడారి జాన్‌సన్(దింతెనపాడు), బి. అఖిలేంద్ర(చెంఘీజ్‌ఖాన్‌పేట), అంకం శ్రీనునాయుడు(యడ్లపాడు) నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన మంత్రి విడదల రజినీకి కృతజ్ఞతలు తెలిపారు.

అథ్లెటిక్ అనూషకు ఆర్థిక సాయం

సత్తెనపల్లి: అథ్లెటిక్ అనూషకి సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ ఆదివారం రూ.20 వేలు ఆర్థిక సాయం స్థానిక వైద్యశాలలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన మల్లాల అనూష నిరుపేద కుటుంబం నుంచి జాతీయ స్థాయి అథ్లెటిక్‌గా ఎన్నో పతకాలు సాధించి, ఇప్పుడు ఏషియన్ గేమ్స్‌కి క్వాలిఫై అయ్యిందని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాదులో శిక్షణ తీసుకుంటున్న అనూష ఆర్థికంగా ఇబ్బంది పడుతుందని స్నేహితుడి ద్వారా తెలుసుకొని.. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రావు రూ.6 వేలు, మచ్చా తిరుపతిరావు రూ.5 వేలు, కొత్త రామకృష్ణ రూ.9 వేలు మొత్తం రూ.20 వేలు ఆర్థిక సాయం అందించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అనూషని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ రాజమోహన్ రెడ్డి, డాక్టర్లు, స్టాఫ్ నర్సులు సిబ్బంది పాల్గొన్నారు.